ఆకలితో అలమటించిన ఆ అభాగ్యుల ఆశ తీరిందా?

కె.ఆర్.కె. మోహన్ కథ

# గోకులాష్టమి ఉట్టి

శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు ఊరిలో జోరుగా సాగుతున్నాయి. ఎప్పటిలాగా ఘనంగానే జరుపుతున్నారు. అనేక చోట్ల పందిళ్ళు వేసి కృష్ణ విగ్రహాలను నిలబెట్టారు. ఆ పందిళ్ళలో పగటిపూట పూజలు యథావిధిగా జరుగుతుంటాయి. రాత్రిళ్ళు హరికథలూ, నాటకాలూ, నాట్యాలు వగైరాలను ఏర్పాటు చేశారు. ఆధునిక కాలం కాబట్టి రికార్డు డాన్సులవీ, వీడియో షోలకీ కూడా కొదవలేదు. ఊరు ఊరంతా ఉత్సాహంతో కొత్త కాంతులను సంతరించుకుంది.

ఊరి స్టేడియం దగ్గర మైదానంలో గోకులాష్టమి ఉట్టిని వ్రేలాడదీశారు. అశేష జన సమూహం అక్కడేచేరి నానా కోలాహలం చేస్తోంది. ఉట్టిని అందుకోదలచినవీరులు ముందుకి వచ్చి నిల్చున్నారు. ఉట్టి ఎత్తుగా కప్పీ మీద నుంచి క్రిందకి వ్రేలాడుతోంది. దానికి కట్టిన త్రాడు రెండో కొసను ఒకవ్యక్తి చేతితో పట్టుకుని నిల్చుని ఉన్నాడు.

ఉట్టి పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి వీరుడు వచ్చి బరిలో ఉట్టి క్రిందనుంచున్నాడు. ఉట్టి బాగా పైన వ్రేలాడుతున్నది. పోటీ ప్రారంభం కాగానే త్రాడు పట్టుకున్న వ్యక్తి ఉట్టిని పోటీదారునికి అందేటట్లుగా క్రిందికి దించాడు. పోటీదారుడు దానిని ఎగిరి అందుకోడానికి ప్రయత్నం చేశాడు.

వెంటనే ఆ రెండో వ్యక్తి జోరుగా త్రాడుని పైకి లాగేశాడు. పోటీదారుడు ఉట్టిని అందుకోలేకపోయాడు. జనం అవహేళనగా చప్పట్లు కొట్టి ఈలలు వేశారు.



ఉట్టెను దించినట్లే దించడం, అందుకోబోయేసరికి నేర్పుగా పైకిలాగేయడం జరుగుతోంది. ఉట్టె అందినట్లే అనిపిస్తూ అందకుండా పోతోంది. అలసిపోయి కొందరు, సమయం మించి కొందరు వీరులు పోటీనుంచి తప్పుకుంటున్నారు. ఏ వీరుడైనా అందుకోగలిగినపుడు మాత్రం జనం ఉత్సాహంతో నింగినేలా ఏకమయ్యేట్లు

చప్పట్లుకొట్టి ఈలలు వేసి అరుపులు అరచి తమ ప్రశంసలను తెలియజేస్తున్నారు.

ఈ ఉత్సాహం జరుగుతున్న ప్రదేశానికి కొంచెం దూరంలో పానీపూరీల బండి వుంది. జనం ఆ ఉత్సవాన్ని చూడడానికి విపరీతంగా రావడంతో బండివాడు అమ్మే గప్‌చిప్‌లకు గిరాకీ విపరీతంగా ఉంది.

గప్‌చిప్‌లుల తినాలనుకున్న జనం బండి చుట్టూ వరుసగా నిలబడి వున్నారు. చేతిలో ఆకులను దొన్నెలలాగా పట్టుకుని నాలుగు వేపుల నుంచీ నలుగురు బండి యజమానికి సంబంధించిన వ్యక్తులు గప్‌చిప్‌లను అందిస్తున్నారు. పళ్ళెంలో వున్నగప్‌చిప్‌లను లెక్కగా చేతిలోకి తీసుకుని ఒక్కొక్క దానికి చిల్లు వేసి అందులో కొంచెం మషాలా బటానీ వేసి గప్‌చిప్‌ల కోసం ప్రత్యేకంగా చేసే ద్రవంలో ముంచి అందరికీ ఆకుల దొన్నెల్లో పెట్తున్నారు. వాళ్ళు పంచుతున్న తీరూ, ఆ వయ్యారం, ఆ చలాకీతనం చూస్తుంటే సముద్ర మథన సమయంలో శ్రీ మహావిష్ణువు జగన్మోహిని రూపంలో దేవాసురులకు అమృతాన్ని పంచుతున్న దృశ్యం తలపునకు వస్తోంది.

అసురులకు అమృతం అందకుండా పోయినట్లే అంతమంది జనంలో కొందరికి ఎంతసేపు మంచున్నా గప్‌చుప్‌లు రాకుండా పోతున్నాయి.

"ఇలా నాక్కూడా ఇయ్యవయ్యా", "అరె ఎంతసేపయింది భయ్... జల్దీ ఇయ్యి", "జర ఇదర్‌బీ దేఖో" వంటి మాటలు గప్‌చుప్ సర్వరుల చెవులకు సోకడమే లేదు. వారి పనిని వారు యాంత్రికంగా చేసుకుపోతున్నారు. బండి ఆసామి పైసలు వసూలు చేసుకోవడంలోనే నిమగ్నమై ఉన్నాడు.

గప్‌చుప్‌లు తిన్నవారు గప్‌చుప్‌గా తిన్న ఆకులు అక్కడే పడేసి పోతున్నారు. ఆ తిని పారేసిన ఆకులలో మిగిలేది ఏమీ వుండదు. ఉన్నా అతి తక్కువగా ఉంటుంది. అది మూతికి రాసుకోడానికే సరిపోదు. అయినా ఆ కాస్త ఎంగిలి కూడు కోసమే ఆ ఆకులమీద కాకులలాగా వాలుతున్నారు ముష్టి పిల్లలూ, పెద్దలూను! అందులోకూడా మళ్ళీ బలాబల ప్రదర్శన. బలవంతులు బలహీనుల్ని, బక్క వాళ్ళనీ పక్కకి నెట్టేసి ఆకుల్లో అధికభాగం పంచుకుంటున్నారు. అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు ఆ బలవంతుల్ని బండి ఆసామీ కుక్కల్ని అదిలించినట్లు అదిలించి కొట్టకుండానే కొట్టినంత పని చేసి తరిమి వేస్తున్నాడు.

ఆ ముష్టివాళ్ళు పోయినట్లే పోయి మళ్ళీ ఈగలు ముసిరినట్లు ముసురుతున్నారు. ఆ కుస్తీపట్లలో సిగపట్లలో చేతబుచ్చుకున్న ఆకులు చిరిగిపోతున్నాయి. అతి స్వల్పంగా ఆకులకు అంటుకున్న పదార్థం క్రిందనే పడిపోతోంది. ఆకలి రుచి ఎరుగదంటారు. బహుశా దానికి అసహ్యం కూడా ఉండదేమో. అందుకే పదార్థం క్రింద పడ్డా పడ్డిన దానిని అందరూ తొక్కుతున్నా ముష్టివాళ్ళు దానినే ఎగబడి తింటున్నారు.

గప్‌చుప్ బండికి కొంచెం దూరంలో రంగడు నిలబడి వున్నాడు. వాడికి వంటిమీద చొక్కా లేదు. కేవలం నిక్కరు మాత్రమే వుంది. అది నిప్పులు వేసినా

తగలబడనంతగా మాసి అట్టలు కట్టిపోయి వుంది. చిరిగిపోయిన ఆ నిక్కరు వెనుకభాగం లోంచి పిర్రలు కనిపిస్తున్నాయి. జుట్టు ఏనాడో సంస్కారాన్నికాని, నూనెని కాని ఎరక్కపోవడంతో ఎర్రబడి అంటలు కట్టి జడలు తిరిగిపోయి వుంది. ఒళ్ళంతా మట్టి కొట్టుకుపోయి, అసలే నలుపైన వంటిని మరింత నలుపుగా వేస్తూ "ఎలుక తోలు తెచ్చి ఎన్నాళ్ళు ఉతికినా" అన్న వేమన పద్యాన్ని జ్ఞప్తికి తెస్తోంది.

ఎనిమిదేళ్ళ ఆ చిన్నవెధవ చంకలో రెండేళ్ళ పసివెధవ ఒకడు. మొండిమొలతో జారిపోతున్నాడు. వాడు ఆకలితో గీపెట్టి ఏడుస్తూ గప్‌చుప్ బండి దగ్గర తింటున్న జనం వంక చేయి చూపిస్తూ అన్నని కొట్టూ నానా అవస్థ పెట్టున్నాడు.

రంగడు వాడి బాధ పడలేక "ఊరుకోరా!" అంటూ చిరాగ్గా వాడిని సముదాయించడానికి ప్రయత్నిస్తున్నాడు. వాడికీ ఏడుపు వస్తోంది. అయితే దానిని ప్రయత్నం మీద ఆపుకుంటున్నాడు. కారిపోతున్న ముక్కుని మాత్రం చీటికిమాటికి తుడుచుకుంటున్నాడు. ఆ పసివాడికి ఆకలితో కడుపు మండిపోతోంది.

కాని ఆ క్షణంలో వాడే పెద్ద. చిట్టి తమ్ముడి బాధ్యత, వాడి ఆకలి తీర్చవలసిన అవసరం వాడి నెత్తినే వున్నాయి. గప్‌చుప్‌లు తింటున్న వారి దగ్గరికివెళ్ళి ఆశగా వారి వంక చూస్తూ అయ్యా, అంటూ చేయి సాచసాగాడు.

అక్కడివారిలో కొందరికి వాడి మాట వినిపించనేలేదు. మరికొందరికి వినపడినా వినబడనట్లే ఊరుకుని గప్‌చుప్‌గా గప్‌చుప్‌లు లాగించేస్తున్నారు.

కొందరు నోటినిండా గప్‌చిప్ ద్రవం ఉండడంతో మాట్లాడలేక, చేతిసైగలతోనే పొమ్మని చెప్తున్నారు వాడివంక కోపంగా చూస్తూ. మరికొందరు పుణ్యాత్ములు వాడిని కొట్టకపోయినా కొట్టేట్లుగా మీదకు వచ్చి చేయెత్తి తిట్టూ వాడిని తరమసాగారు.



రంగడు బెదురు చూపులు చూస్తూ దూరంగా పోయి నుంచున్నాడు. వాడి తమ్ముడి ఏడుపు క్రితిమించిపోతోంది.

"అబ్బబ్బ... ఎక్కడికిపోయినా ఈ దిక్కుమాలిన ముష్టివాళ్ళ బెడద తప్పడంలే దండీ!" అంటూ ఒకాయన ప్రక్క వ్యక్తితో అని గుట్టుగా గప్‌చుప్‌ని నోట్లోకి కుక్కుకు న్నాడు.

ప్రక్కాయన నోట్లోని గప్‌చుప్‌ని గుటుక్కున మ్రింగి "అబ్బే అలా అంటే ఎలాగ! వీళ్ళు మన జాతీయ సంపద. ఏది పెరిగినా పెరక్కపోయినా వీళ్ళ సంఖ్య మాత్రం నిరంతరాయంగా పెరిగిపోతోంది" అంటూ వ్యంగ్య ధోరణిలో సమాధానం ఇచ్చాడు.

గప్‌చుప్ సర్వర్ మారువడ్డన వడ్డించడంతో ఆ ఇద్దరూ మాటలు ఆపి తిరిగి చేతికీ నోటికి పని చెప్పారు.

తమ్ముడి ఏడుపు అంతకంతకి ఎక్కువవుతుంటే రంగడికి మతిపోతోంది. సహనం నశించిపోతోంది. అసలు ఆ పసి వయసులో అంతటి సహనం ఉండడమే చాలా ఆశ్చర్యం కాని పరిస్థితుల వల్ల కష్టాలలో పుట్టి కష్టాలలోనే పెరగడంవల్ల ఆ చిన్నారి వయసులోనే అంతటి సహనం అలవడింది.

రంగడు దూరంనుంచే బండివైపు తిరిగి ఆశగా చూశాడు. అక్కడ తనలాగే ఇంకా కొందరు ముష్టిపిల్లలు, అడుక్కుంటూ తిట్లూ, చివాట్లు తింటూ ఉండడం చూశాడు. తనలాంటి వాళ్ళు ఇంకా ఉండడంతో తనకీ తోడు ఉన్నారనే ధైర్యమూ, తాను ఒంటరివాడు కాదనే తృప్తీ. మిగిలిన పిల్లలు కూడా చివాట్లు తింటున్నారనే సంతోషమూ కలిగాయి. ఆ వివిధ భావాలతో ఆ చిన్నారి మనసు కాసేపు పరాయత్తమయింది.

చిన్నవాడి ఏడుపు మరీ తారాస్థాయినందుకోవడంతో రంగడు తిరిగి ఈ లోకంలోకి వచ్చాడు. తమ్ముణ్ణి ఎంత సముదాయించినా ఊరుకోవడంలేదు. అంతకంతకీ ఏడుపు హెచ్చిస్తూ అన్నని కొట్టూ జుట్టు పీకుతూ బాధపెట్టసాగాడు.

రంగడిలో సహనం పూర్తిగా నశించింది. 'ఒరేయ్ ఏడ్చావంటే కొడ్తాను' అంటూ గట్టిగా అరచి చేయెత్తాడు.

పసివాడికి భయం అంటే ఏమిటో తెలియని వయసు. అన్న గదమాయిస్తే ఏడుపు స్థాయిని పెంచాడే కాని దించలేదు.

రంగడికి ప్రాణం విసిగి చిన్నవాడిని ఒక్క కుదుపు కుదిపి క్రిందికి దింపి వెధవా చంపేస్తున్నావు. వెధవ ఏడుపు నువ్వూను చావు అంటూ వీపుమీద ఓ దెబ్బవేశాడు.

చిన్నవాడు ఏడుపు మరీ పెంచి గుక్కలు పెట్టి గగ్గోలు పెడ్తూ నేలపడి దొర్లసాగాడు.

తమ్ముణ్ణి ఓ చిన్న దెబ్బ వేశాడేకాని వాడి ఏడుపు చూస్తుంటే కడుపు తరుక్కుపోయింది రంగడికి. మళ్ళీ వాడిని తీసుకుని చంకన వేసుకుని "ఒరేయ్ ఏడవకురా అక్కడ నీకేమైనా పెడ్తాలేరా" అంటూ తిని పారవేసిన ఆకులవైపు చూపించాడు.

అన్న ఎత్తుకుంటుంటే అంతవరకూ గింజుకున్నవాడు అన్న ఏమైనా పెడ్తాలే అనగానే ఏడుపు స్థాయి తగ్గించి ఆశగా అటు చూశాడు.

తమ్ముడి ఏడుపు తగ్గిందే చాలని వాడిని చంకన వేసుకుని ఆ ఆకుల వైపుగా వెళ్ళాడు రంగడు.

తినేసి ఆకుని పడవేయడం తడవుగా, గ్రద్దల్లాగా తన్నుకుపోతున్నారు దానిని అక్కడ జేరినముష్టివాళ్ళు అదేదో బంగారమో, మహద్భాగ్యమో అన్నట్లు.

బండి దగ్గర తింటున్న పెద్ద మనుష్యులకి కనికరం లేకపోతే పోయె. సాటి ముష్టివాళ్ళు కనుక వాళ్ళేమైనా దయతలచి ఇస్తారేమోనని ఆశపడ్డాడు రంగడు.

"అయ్యా... మా తమ్ముడు ఆకలేసి ఏడుస్తున్నాడు. కొంచెం ఇవ్వండయ్యా" అని దీనంగా అడిగాడు. మనుషులు ముష్టివాళ్ళయినా, వాళ్ళ మనసులు గొప్పగా వుంటాయి. అనుకున్నట్లున్నాడు వాడు. కాని "పెద్ద మనుషుల" పరసన ఉన్నందున ఏమో వాళ్ళ మనసులు కూడా వారి మనసులలాగానే బండబారిపోయాయి. పైగా ముష్టివాడికి ముష్టివాడు శత్రువు అన్న నానుడి ఉండనే వుంది.

కొందరు వాడి మాటలే వినిపించుకోలేదు. మరికొందరు "పోరా... పో ... మాకే లేందే నీ కేమిమ్మంటావు?" అని కసిరారు.

"ముష్టిలో వీరముష్టి" అని చమత్కరించాడు ఒక చదువుకున్న ముష్టివాడు.

"తాదూర సందులేదు మెడకో డోలు. వీడికి తోడు వీడి చంకవ చంటాడు కూడాను" అన్న నానుడి పలికాడు లోకాను భవంగడించిన ఒక వృద్ధ ముసలివాడు.

"ఏరా... పేరు తమ్ముడిదీను నోరు నీదీను యేంట్రా?" అని తన వ్యాఖ్యకు తానే మురిసిపోతూ ప్రక్కనున్న వాళ్ళు తన హాస్యోక్తిని విన్నారో లేదో నన్నట్లు ఓరగా చూశాడు ఒక యువ ముష్టివాడు.

వాళ్ళెవరి మాటలూ పట్టించుకోకుండా "అయ్యా కొంచెం పెట్టండి. తమ్ముడు ఏడుస్తున్నాడు" అంటూ చేయి సాచి అడగసాగాడు.

ఇంతలో వెనకాలనుంచి రంగడికి దగ్గరగా ఆకు వచ్చి పడింది. ఆ పదార్థం నచ్చలేదో ఏమో ఆ పుణ్యాత్ముడెవరో కొంచెం ఎక్కువగానే ఆ ఆకులో వదిలేశాడు

ఎలుకవి చూసి దూకే పిల్లిలాగా చంగున దూకి ఆ ఆకుని చేజిక్కించుకున్నాడు రంగడు.

"ఒరేయ్ దాన్నక్కడ వదిలేయిరా లేకపో



## పొదుపు

"విదేశీ యాత్రల మీద ప్రభుత్వం డబ్బు తగ్గించాలనుకొంటోంది! ఎలా?" పత్రికా విలేకర్ల సమావేశంలో ఆర్థిక మంత్రిగారు అడిగారు.

"విదేశాలన్నీ తిరిగి ఈ విషయంలో వారంతా ఎలాటి జాగ్రత్తలు తీసుకొంటున్నారో పరిశీలించండి!" చిలిపిగా అన్నాడు ఓ విలేకరి.

—జోకర్ (హైదరాబాద్)

తే చంపేస్తా'' అన్న గర్జన వెనుకనుంచి వినిపించింది.

రంగడు భయంగా అటు చూశాడు.

రౌడీ తరహాలో వున్న ఒక పెద్ద ముష్టివాడు వాడివంక కోపంగా చూస్తూ వస్తున్నాడు.

వాడిని చూడగానే రంగడి గుండెలు అవిసిపోయాయి. ఆ పదార్థమున్న ఆకును చేతిలో పుచ్చుకుని ఒక చంకలో తమ్ముణ్ణి ఎత్తుకుని పిక్క బలంకొద్దీ పరుగు లంకించుకున్నాడు.

"ఒరేయ్ ఆగు'' అంటూ వెంటపడ్డాడు ఈ వీరముష్టివాడు.

సాయంత్రం అవుతుండడంతో గోకులాష్టమి ఉత్సవాన్ని చూడటానికి జనం అంతకంతకీ ఎక్కువగా వస్తున్నారు. మైదానం కిటకిటలాడుతోంది. రోడ్డుమీద వచ్చే పోయే వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది.

రంగడు ఎదురుగా చూశాడు. గోకులాష్టమి ఉట్టి ఎగురుతూనే వుంది. దానిని తిలకిస్తూ ఆనందిస్తున్న జనం ముమ్మరంగా ఉన్నారు. పరుగెత్తుకువెళ్ళి తాను ఆ జనంలో కలిసిపోతే ఇంక ఆ రౌడీ ఏమీ చేయలేడు.

వెనక చూపులు చూస్తూ బాణంలా దూసుకుపోతున్నాడు రంగడు. ఆకలికి నీరసించిన ఆ చిన్నారి కాళ్ళలో అంతటి సత్తువ ఎలా వచ్చిందో మరి! భయం అన్నింటినీ అధిగమిస్తుంది కాబోలు!

రౌడీ వెనకాల నుంచి తరుముతూనే వున్నాడు.

రంగడు రోడ్డుకు అడ్డంపడి పరుగెడుతున్నాడు. ఆకుని మాత్రం చేతిలో గట్టిగా పట్టుకున్నాడు. జారిపోతున్న తమ్ముణ్ణి పైకి లాక్కుంటున్నాడు. ఆ రోడ్డుని దాటి మైదానంలోకి ప్రవేశించగలిగితే ఇంక ఫరవాలేదు. జనంలో కలిసిపోవచ్చు.

రౌడీ వంకనే చూస్తూ పరుగెడుతున్న రంగడికి రోడ్డుమీద వస్తూ పోతున్న కార్లూ, లారీలు, బస్సులు, సైకిళ్ళూ ధ్యాసే లేదు. వాటిని తప్పించుకుని వాడు పరుగెత్తడంలేదు. అవే వాడిని తప్పించుకుని పరుగెడుతున్నాయి.

అయితే వేగంగా వస్తున్న ఒక లారీకి మాత్రం అది సాధ్యంకాలేదు. కీచుమని భయంకరంగా అరుస్తూ ఆగింది.

ఆ శబ్దం విని జనం అంతా అటు చూశారు.

లారీ ముందు చక్రం క్రింద రక్తపు మడుగులో రంగడు వాడి తమ్ముడు నలిగి ముద్దయిపోయి వున్నారు. ఆ చిన్నారుల ప్రాణాలు ఆకలిని శాశ్వతంగా జయించాయి. ఏ ఆకలిని తీర్చుకోవడానికి, ఎంగిలి తిండిని తీసుకుని పరుగెత్తాడో, ఆ ఆకు భద్రంగా వాడి చేతిలోనే వుంది. చేతిలోని తిండి నోటిలోకి వచ్చే ప్రాప్తి లేకపోయింది.

గోకులాష్టమి ఉట్టి ఎగురుతూనే వుంది చేతికి అందినట్లే అంది అందకుండా పోతోంది.

*